## క్లుప్తంగా

### రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: మండలంలోని ఓ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలుచేసి నిల్వచేసినట్లు పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వివరాలిలా.. మద్దూరు పట్టణంలో పెదిరిపాడ్ రోడ్‌లోని అమీజీ ట్రేడర్స్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులుచేసి లోపలి ఉన్న షెట్టర్‌లో 71ప్యాకెట్ల రేషన్ బియ్యం సీజ్‌చేశారు. షాప్‌యజమాని మహిముద్‌పై కేసునమోదు చేసినట్లు డీటీ ఆనంద్ తెలిపారు.

### మండల వ్యవసాయ అధికారిగా మణిచందర్

దామరగిద్ద: మండల వ్యవసాయ అధికారిగా మణిచందర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎనిమిదేళ్లుగా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో ఏఈఓగా పనిచేశారు. వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవంతో ఏంఏఓగా మండల రైతులకు తనవంతు సేవలను అందిస్తానని తెలిపారు.

**వ్యవసాయశాఖ అధికారిగా నవీన్‌కుమార్**

ధన్వాడ: మండల నూతన వ్యవసాయశాఖ అధికారిగా బి.నవీన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చెపట్టారు. ప్రస్తుతం ఎంఈఓ రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ తరుపున రైతులకు నిత్యం అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.

### సాహిత్య పుస్తకాలు విక్రయం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో సమాచార భారతి జాతీయ సాహిత్య పుస్తక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ మరాఠీ వెంకట రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కోస్గిరూరల్: వ్యవసాయదారులు తాము పండించిన ధాన్యంలో తేమశాతం 15మించి ఉండకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి రేష్మరెడ్డి అన్నారు. మంగళవారం గుండుమాల్ మండల పరిధిలోని కొమ్మూర్, వీరారం గ్రామాల్లో వ్యవసాయకొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ధాన్యాన్ని అరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు హర్షవర్ధన్, తిరుపతి, రైతులు ఉన్నారు.

### ఈ పాస్ మిషన్‌లో నమోదుచేయాలి

దామరగిద్ద: ఎరువుల విక్రయాలను ఎప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌లో రైతుల ఆధార్ అనుసంధానంతో నమోదు చేయాలని వ్యవసాయ అధికారి మణిచందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఎరువుల, క్రయ విక్రయాలకు చెందిన ఈపాస్ స్టాక్, బ్యాలెన్స్‌ను సరిచూసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఏఈఓ నరేష్ ఉన్నారు.

### ఆలయాలపై దాడులు అరికట్టాలి

కోస్గి: దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న హిందూ దేవాలయలపై దాడులను ఆరికట్టాలని పలు హైందవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాజీ చౌరస్తా నుంచి రామాలయం చౌరస్తా వరకు అక్కడ నుంచి వివేకానందా చౌరస్తా నుంచి తిరిగి శివాజీ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

### సద్వినియోగం చేసుకోవాలి



నారాయణపేట: కనుమరుగవుతున్న కళలకు జీవం పోస్తున్న బాలకేంద్రాలని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్ అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా బాల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బృందం గీతాల పోటీలలో 10గ్రూప్ పాల్గొని దేశభక్తి తెలంగాణ పాటలను ఆలపించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్‌ను శాలువా, జ్ఞాపికతో సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. సంగ నర్సింహులు పాల్గొన్నారు.

### విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాలను మానిటరింగ్ టీమ్‌తో కలిసి సందర్శించారు.

# పేదలను ఆదుకోవడమే లక్ష్యం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ద్వారా అందించే పథకాలు తప్పనిసరిగా అందజేస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ పి.బెన్‌షాలంతో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన 138మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరు విషయంలో రాజకీయాలు చేశారని, కొన్ని చెక్కులు మంజూరైనా నేటికి లబ్ధిదారులకు అందలేదన్నారు. పేదప్రజలకు అందించే పథకాల విషయంలో రాజకీయాలు చేసి బ్రతికే జీవితం వ్యర్థమని ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరులో దళారులను నమ్మొద్దని నేరుగా తనను సంప్రదించాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గందే అనసూయ, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, పుర కౌన్సిలర్లు మహేష్, అమీరుద్దీన్, నర్సింహారెడ్డి, ఈదప్ప, వెంకట్‌రాంరెడ్డి, నరహరి, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని మహిళా సంఘం సభ్యులు ఏర్పాటుచేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు మహిళా సంఘం సభ్యులు పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా శక్తి క్యాంటీన్‌ను ముందుకు వచ్చిన ఎక్లాస్‌పూర్ శబరి మహిళాసంఘం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.
- పట్టణంలోని ఇంటింటా సర్వేలో భాగంగా సాయి విజయ్ కాలనీలోని వారి సొంతం గృహం సీవీఆర్ భవన్‌లో నివాసం ఉంటున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్‌కు తన వివరాలు అందజేశారు. సర్వేలో ప్రజల స్పందన, ఎదురయ్యే సమస్యలను ఎన్యూమరేటర్‌తో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ, సలీం, మహేష్ ఉన్నారు.

# సర్వేకు సంపూర్ణంగా సహకరించాలి



చిన్నపొర్లలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఉమాపతి



ధన్వాడలో..



మాగనూర్‌లో..

మాగనూర్: మండలంలో ప్రభుత్వం పకడ్బందీ చేపట్టిన సమగ్ర సర్వే ప్రశాంతంగా సాగుతుందని ఎంపీడీఓ రహమతుద్దీన్ అన్నారు. ఈ మేరకు.. ఆయన పలు గ్రామాల్లో సాగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, ప్రజలు సహరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. మండల కేంద్రంలో రాత్రి సమయంలో కూడా సర్వే నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే గ్రామస్తులు ఇంటి వద్ద ఉండడంతో సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు సర్వేను నిర్వహిస్తున్నారు.

ఊట్కూరు: మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ప్రత్యేకాధికారి ఉమాపతి తనిఖీ చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులతోపాటు ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, తహసీల్దార్ రవి సర్వేను పరిశీలించారు.

# చెరువులో చేపపిల్లల విడుదల



చేపపిల్లలను వదులుతున్న నాయకులు

మాగనూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో జిల్లా మత్స్యశాఖ కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో చేపపిల్లల విడుదల చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం శాఖా అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం వందశాతం రాయితీపై చేపపిల్లలను సరఫరా చేస్తుందన్నారు. మండలానికి 80వేల చేపపిల్లలు అందించాల్సి ఉండగా టెండర్ ఆలస్యంతో 39వేల చేపపిల్లలను మాత్రమే కాంట్రాక్టర్లు చేపపిల్లలను తీసుకొచ్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. వెంకటయ్య, కృష్ణయ్య, బొంబాయి మురళి, డబ్బ కృష్ణయ్య, వర్కూర్ నర్సింహ, నరేష్, అనిల్, పుంజనూర్ మహదేవ్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట: స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసిందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు ఉదయభాను పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంస్థాగత కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ సభ్యత్వం మరింత పెంచాలని కోరారు. అలాగే ఈ నెలలో జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పార్టీకోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సిద్ది వెంకట్ రాములు, కృష్ణ, అప్పిరెడ్డి పల్లి రాము, సైదప్ప, వినోద్, పాండు పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను బడికి పంపించాలి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ఊట్కూరు: బడీడు పిల్లలను బడికి పంపించాలని బాలల సంరక్షణ అధికారి తిరుపతయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఓఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బడీడు పిల్లలను బడికి పంపించాలని, పనికి పంపొద్దన్నారు. 14సంవత్సరాల లోపు బాలబాలికలను ఎవరైన పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. అనంతరం బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. హజమ్మ, శ్రావణ్‌కుమార్, నారాయణ, భాగ్యశ్రీ, సంతోష, అభిషేక్ పాల్గొన్నారు.

# కలెక్టర్‌పై దాడి అమానుషం



పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

నారాయణపేట: వికారాబాద్ కలెక్టర్ విధి నిర్వహణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌పై దాడి చేయడం అమానూషమని ప్రభుత్వ ఉద్యోగులు అన్నారు.ఈ మేరకు.. కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడిచేయడం అప్రజాస్వామికమని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్ నాయక్, తహసీల్దార్ బక్క శ్రీను, పీఆర్టీయూ లీడర్ జనార్దన్ రెడ్డి, టీఎన్జీఓ నేతలు, తహసీల్దార్లు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు: వికారాబాద్ కలెక్టర్ విధి నిర్వహణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్‌పై దాడి చేయడం అమానూషమని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులకు సంఘీభావం ప్రకటించారు. ప్రజాసంఘాల నాయకులు అలీ, హన్మంతు, దాసు, కృష్ణ, కేశవులు పాల్గొన్నారు.

### సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

కోస్గి: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న సదర్ ఉత్సవాలను నియోజకవర్గ పరిధిలోని యాదవ సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పీరంపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు.. స్థానిక లక్ష్మీవెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా డైరెక్టర్ అల్లాపురం నర్సింహులు, మండల అధ్యక్షుడు గుర్రం హన్మంతు, వెంకటేష్, మహిపాల్, మోహన్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

### మహిళా సంక్షేమ పథకాలను అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళ సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళ సంఘాలతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల మహిళలకు రూ. 2500ఇవ్వాలని, చేయూత పెన్షన్ రూ. 4వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మహిళసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### పాఠశాలను సందర్శించిన డీఈఓ

నారాయణపేట: మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈఓ మహ్మద్ అబ్దుల్ ఘని సందర్శించారు. మధ్యాహ్నభోజనం, పదో తరగతి స్పెషల్ క్లాస్ రిజిష్టర్లను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించేలా చొరవతీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం భారతి ఉపాధ్యాయ బృందంతో చర్చించారు.

### ఆర్థికసాయం అందజేత

కోస్గిరూరల్: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన జగన్‌మొహన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు.. కలిసి చదువుకున్న తోటిస్నేహితుల్లో ఒకరు చనిపోవడంతో ఆప్తమిత్రుడి కుటుంబానికి మిత్రులందరూ కలిసి మంగళవారం ఆర్థికసాయంగా రూ.71వేల నగదును అందజేశారు. శేఖర్‌రెడ్డి, శంకర్‌నాయక్, నర్సింహులు, గోపాల్‌గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు భరోసా ఇవ్వాలి

మరికల్: ప్రభుత్వం యాసంగికి పెట్టుబడి కింద రైతు భరోసా చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ సాధ్యం కాని పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను చేసిందన్నారు. యాసంగి సాగు సమయం దగ్గర పడుతుందని వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకోవడం కోసం రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

నారాయణపేట టౌన్: గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ఐకేపీ కేంద్రాల ద్వారా జరగాలని రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య మాట్లాడారు.. వానాకాలం ధాన్యం కోతలు కోస్తున్నందున ఐకేపీ కేంద్రాలను వెంటనే కొనుగోలుచేసే విధంగా ప్రభుత్వం చర్యలుచేపట్టాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు శివకుమార్, అరుణ్, వెంకటప్ప ఉన్నారు.

### 14నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోస్గిరూరల్: నవంబర్ 14నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో పుస్తకాలు, ఫర్నీచర్‌ను పరిశీలించారు. కావాల్సిన వసతులను సమకూర్చుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖోఖో పోటీలు

ధన్వాడ: ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల స్థాయి ఖోఖో పోటీలు బాలబాలికలకు నిర్వహించబడునని, పోటీలు మండలంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఏబీవీపీ మండల కన్వీనర్ బాలరాజ్ తెలిపారు.

### ఆలయంలో పూజలు

నర్వ: కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు వేకుజామునే పూజలు నిర్వహించారు. ఈ మేరకు.. శివాలయాల్లో భక్తులు పరమేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, లింగాష్టకాలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఆలయ ఆవరణలో ధ్వజస్తంభానికి ఆకాశదీపం వెలిగించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



# విద్యారంగ పటిష్టతకు రాజీలేని పోరాటం



ప్రమాణస్వీకారోత్సవం చేస్తున్న సభ్యులు

నారాయణపేట: ప్రభుత్వ విద్యారంగా పటిష్టతకు టీపీటీఫ్ రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకోసం కృషిచేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో టీచర్స్ ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. 317జీఓతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు స్థానికతను సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ కష్టార్జితం నుంచి దాచుకున్న జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, సరెండర్ లీవ్ బిల్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ సమస్యల సాధనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు, అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవేందర్ , రెడ్డప్ప ఉపాధ్యక్షుడిగా కే మాధవి , దశరథ్ , వాల్యా నాయక్‌ను ఎన్నుకున్నారు.

# మహిళలకు అండగా షీటీం



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మహిళ చట్టాలు, సైబర్‌నేరాలు తదితర అంశాలపై షీటీం పోలీసులు బాలరాజు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులకు షీటీం అండగా ఉంటుందని, ఎవరైనా ప్రేమపేరుతో వేధించిన, ఫోన్లో అనుచిత పోస్టులు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. కాలనీలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కాలనీలో దొంగతనాలు జరగకుండా భద్రతకోరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు బాలరాజు, చెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు నెట్‌బాల్ పోటీలలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 7నుంచి 9వరకు జరిగిన తెలంగాణ 3వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్ బాల్ ఫాస్ట్ జిల్లా జట్టు తరుపున 8మంది క్రీడాకారులు పాల్గొని మొదటిస్థానం సాధించగా మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరపున 5మంది పాఠశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రాజారాం పీడీ కోచ్ డా.రామ్మోహన్‌గౌడ్ తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరం



బీపీ చెకప్ చేసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. వనపర్తి, ఆత్మకూర్‌కు చెందిన ప్రభుత్వ వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. బీపీ, షుగర్‌తో పాటు వెన్నునొప్పులు, కండరాల నొప్పులతో పాటు పలు రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సంక్రీత్, వంశీకిరణ్, అనిల్, ఉపేందర్ కుమార్, కల్పన, సునీత, నిర్వాహకులు స్మార్ట్‌డాక్స్ బిజినెస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఆర్ శృతి, ఆనంద్, హరీశ్ పాల్గొన్నారు.

### నేడు రక్తదాన శిబిరం

ఆత్మకూర్: స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రక్తదానం శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని సేవాసమితి అధ్యక్షుడు బాలు కోరారు. రక్తదానంతో ఒకరికి ప్రాణదానం చేసిన వారవుతారని, సేకరించిన రక్తం తలసేమియా రోగులకు వినియోగిస్తారన్నారు. రక్తదానం చేయదలచిన వారు 98484 56391 నంబరుకు సంప్రదించాలని కోరారు.

# తాగునీటి కుళాయి గదికి తాళం



తాళం వేసిన ఉన్న గది



గదిలో ఏర్పాటు చేసిన కుళాయిలు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల గదికి తాళం వేసి ఉండటంతో విద్యార్థులు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో మాజీ జెడ్పీటీసీ తన నిధులు రూ.లక్ష కేటాయించి విద్యార్థులకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. అవి కాస్తా మరమ్మతుకు గురికావడంతో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరైన నిధులతో కుళాయిల మరమ్మతుతో పాటు వాటి చుట్టు రక్షణ కోసం గది నిర్మించారు. పాఠశాల సమయంలో కుళాయి గదిని తెరిచి నీటి వసతిని కల్పించాలి. కాని కుళాయి గదికి తాళం వేసి ఉంచడంతో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పాఠశాల సమయంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి వసతిని కల్పించాలని కోరుతున్నారు.